## క్లుప్తంగా

### మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: మండలంలోని పురోహితునివలస మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంతోపాటు 7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 20వ తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యాశాఖ కమిషనర్ మరో అవకాశం కల్పించారని పేర్కొన్నారు.

### ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట


పూజల్లో పాల్గొన్న రంగునాయుడు

మక్కువ: మండలంలోని దబ్బూరివలస గ్రామంలో గ్రామస్తులు నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామస్తుల శ్రమదానం


మలుపుల వద్ద తుప్పలు, డొంకలు తొలగిస్తున్న చినమరికి-పెదమరికి గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదమరికి గ్రామం మీదుగా ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు నిరంతరం జరుగుతుంటాయి. ఈ క్రమంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ రహదారిపై పలుచోట్ల మలుపుల్లో దట్టంగా తుప్పలు, డొంకలు ఏర్పడడంతో ఇటీవల ఎదురుగా వస్తున్న వాహనాలను అంచనా వేయలేని స్థితిలో అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. అలాగే కొందరు ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు మలుపుల వద్ద దట్టంగా ఏర్పడిన తుప్పలు, డొంకలను రోడ్డుకు ఇరువైపులా తొలగించాలని సంబంధిత అధికారులను కోరారు. దీనికి అధికారుల నుంచి స్పందన కరువవడంతో చేసేది లేక స్థానిక గ్రామస్తులు స్వచ్ఛందంగా ఆదివారం ముందుకు వచ్చి మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన తుప్పలు, డొంకలను తొలగించి శ్రమదానం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సురక్షితమైన రహదారులుగా తీర్చిదిద్దాలని, అలాగే మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### నిఘా మరింత పటిష్టం

రాజాం సిటీ: నేరాల నియంత్రణకు నిఘా మరింత పటిష్టం చేశామని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగానే పట్టణంలో 11 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఆదివారం ఆయన తెలిపారు. ప్రధాన కూడళ్లు, బ్లాక్ స్పాట్స్ తదితర ప్రాంతాల్లో నేరాలు, ప్రమాదాలకు పాల్పడిన వారిని గుర్తించడంలె సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ లో 6, 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లుతో పాటు ప్రథమ ఇంటర్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే.. అదే నెల 24న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9542078996 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### ఘనంగా హనుమాన్‌కు పూజలు


పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

బాడంగి: మండలంలోని పూడివలసలో సర్పంచ్ రెడ్డి తిరుపతినాయుడు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు రోజున వేదపండితులు యడవల్లి శ్రీనివాసశర్మ నేతృత్వంలో రుత్వికులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

### హుండీల ఆదాయం లెక్కింపు రేపు

రాజాం సిటీ: ఈ నెల 10న స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో హుండీల్లో కానుకలను లెక్కించనున్నామని ఆలయ ఈఓ పి.శ్యామలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో హుండీలు తెరిచి, భక్తుల సమక్షంలో ఆదాయం లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

# లోకేష్ వద్దకు తమ్ముళ్ల పంచాయితీ..!

- ఎమ్మెల్యే విజయచంద్రపై ఫిర్యాదుకు సిద్ధమవుతున్న సీనియర్లు

పార్వతీపురం రూరల్/పార్వతీపురం:


వెంకంపేట-చినబొండపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో పార్టీ అంతర్గత సమావేశానికి ఏర్పాట్లు

ఏరు దాటేంతవరకు ఏటి మల్లన్న.. దాటాక బోడి మల్లన్న.. చందంగా పార్వతీపురం ఎమ్మెల్యే తీరు ఉందని పార్వతీపురం నియోజకవర్గం తెలుగు తమ్ముళ్లు అంతర్మథనం చెందుతున్నారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన తరువాత గెలుపుకోసం కృషిచేసిన తెలుగు తమ్ముళ్లను ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో పార్టీ అధినాయకుడి దృష్టికి పరిస్థితిని తీసుకువెళ్లారు. ఆదినుంచి టీడీపీలో ఉన్నవారిని పట్టించుకోకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరించి కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు లేకుండా చేస్తున్నారని ఆపార్టీ నాయకులు వాపోతున్నారు. ఈ మేరకు ఇప్పటికే అధిష్టానం వద్ద నియోజకవర్గంలోని పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లో ఉన్న తాజా పరిస్థితులపై వారి మొరను వినిపించి ఎమ్మెల్యే చేస్తున్న అవినీతిని సైతం తెలియజేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సోమవారం రాష్ట విద్యాశాఖామంత్రి నారా లోకేష్ పార్వతీపురం వస్తున్న నేపథ్యంలో భంగపడ్డ తెలుగుతమ్ముళ్లు సమావేశానికి హాజరుకావాలని లోకేష్ నుంచి పిలుపువచ్చినట్లు కేడర్‌లో వినిపిస్తోంది. ప్రధానంగా నియోజకవర్గంలో పార్టీలో ఏర్పడిన సమస్యలను సరిదిద్దేందుకే మంత్రి లోకేష్ పర్యటనను ఖరారు చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పత్రికా విలేకరులకు అనుమతి లేకుండా కేవలం పార్టీ కేడర్‌తోనే అంతర్గత సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఆ పార్టీకి చెందిన బీసీ నేత, మాజీ ఎమ్మెల్సీ, అలాగే మాజీ ఎమ్మెల్యేకు కూడా పిలుపు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఎమ్మెల్యేతో ఇప్పటికే అదిష్టానానికి ఫిర్యాదు చేసిన నాయకత్వంతో మంత్రి లోకేష్ సయోధ్య కుదిర్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో చినబాబు చేసే సయోధ్య తమ్ముళ్ల మధ్య ఎంతమేరకు ఫలితాన్ని ఇస్తుందో వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. నేడు జరగనున్న ఈ సమావేశానికి టీడీపీ శ్రేణుల్లో అధిక ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 69 మంది వైద్యపరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నేత్రవైద్యుడు జాక్సన్

సీతానగరం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ వెంకట రమణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్రవైద్యశిబిరంలో 69 మందికి కంటి పరిక్షలు నిర్వహించారు. ఈ మేరకు వెంకటరమణ మాట్లాడుతూ శంకర్‌ఫౌండేషన్,పార్వతీపురం మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో గ్రామాల్లో కంటి వ్యాధుల నివారణకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అంధత్వ నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శంకర్‌ఫౌండేషన్ కంటి వైద్యుడు డాక్టర్ జాక్సన్ మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 69 మందికి కంటి రోగాలతో ఇబ్బందులు పడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి 41 మందికి కంటికి శస్త్ర చికిత్సలు చేయడానికి సిద్ధం చేశామన్నారు. వారందరికీ విశాఖపట్నంలో శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, పలుగ్రామాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## జ్వరాలతో వణికిపోతున్న ఏజెన్సీ


ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సాలూరు: సాలూరు ఏజెన్సీ ప్రాంతం జ్వరాలతో వణికిపోతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్‌వైనాయుడు, పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ, పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని పరిశీలించామని, గిరిజన ప్రాంతాల్లో జ్వరాల సీజన్ ప్రారంభమై నెలకు పైగా దాటిందని, రోజురోజుకూ జ్వర పీడితులు పెరిగిపోతున్నారన్నారు. ఏరియా ఆస్పత్రిలో పేషెంట్లుకు సరిపడా బెడ్లు లేకపోవడంతో, ఒక్కో బెడ్ మీద ఇద్దరి నుంచి నలుగురు వరకు రోగులు సర్దుకోవడం కనిపించిందని చెప్పారు. ఆరోగ్యం పాడవకుండా యోగా చేయమని ప్రభుత్వం చెబుతోందని, అనారోగ్యం కారణంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు సరిపడా బెడ్‌లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే గిరిజన ప్రాంతాల్లో వైద్యానికి సంబంధించి రివ్యూ చేసి సరిపడా నిధులు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు విజయ్, డుంబ్రి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ మళ్లీ వస్తున్న ఫిర్యాదులు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు వి. దాలినాయుడు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుకే తప్ప పరిష్కారం సమస్యల అంతంత మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు స్థానిక కలెక్టరేట్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సుమారు 90 -100 వరకు అర్జీలు వస్తున్నాయన్నారు. అందులో కొన్నింటిని మాత్రమే సంబంధిత అధికారులు ఆన్‌లైన్ చేస్తున్నారన్నారు. ఆన్‌లైన్ అయిన దరఖాస్తుదారుకు సమస్య పరిష్కార నిమిత్తం సెల్‌ఫోన్‌కు మెసేజ్, సమాచారం అందుతుందన్నారు. ఆన్‌లైన్ చేయని వాటికి ఎటువంటి సమాచారం ఉండడం లేదన్నారు. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్య పరిష్కారం కోసం వస్తున్న అర్జీదారులకు నిరాశే ఎదురవుతోంన్నారు. ఒకవేళ ఆన్‌లైన్‌చేసినప్పటికీ వాటి పరిష్కారం కూడా ఏడు చేపల కథలా ఒక డిపార్ట్‌మెంట్ అధికారులు ఇంకో డిపార్ట్‌మెంట్‌కు తెలియజేశామంటూ. అర్జీదారు చేతిలో కాగితం పెట్టి సమస్య పరిష్కారమైనట్లు ముగింపు చెబుతున్నారన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మళ్లీ మళ్లీ అదే సమస్యతో ఫిర్యాదుదారు వస్తున్నప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి


రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయాల కార్యదర్శి శంకరరావు

సీతంపేట: గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు ఆ శాఖ కార్యదర్శి వీవీజీ శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పుస్తకాలు, రికార్డులను పరిశీలించారు. నిరుద్యోగులు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఉన్నాయా..? ఇంకా అవసరం ఉన్నవాటి గురించి అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ ముందు షాపింగ్ కాంప్లెక్స్ ఉండడంతో రహదారి లేదని గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే కళావతి


ఆంజనేయులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి అండగా ఉంటామని పాలకొండ మాజీ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతి అన్నారు. సొలికిరి గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొత్తకోట ఆంజనేయులు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కళావతి వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబుతో కలసి ఆదివారం ఆయన్ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కూటమి నాయకుల అకృత్యాలను ఎదుర్కోవడంలో ముందుంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఆమెతో పాటు పార్టీ నాయకులు పిన్నింటి హరిబాబు, కాగితాపల్లి కృష్ణారావు, పతివాడ పగడాలమ్మ, అంగూరు వైకుంటరావు, కొవ్వాడ చిరంజీవులున్నారు.

## కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు

సీతానగరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, జగనన్న అభిమానులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న సచివాలయ, గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనాలు, రైతుసేవా కేంద్రాల భవనాలను మూడు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చినా ఇంతవరకూ అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పనులు చేసిన నిర్వాహకులకు ఇంతవరకూ బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఇంటింటికీ నిరంతరం నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఎండీఎం వాహనాలను రద్దు చేయడంతో పంచాయతీల మధుర గ్రామాల ప్రజలు సరుకులు తరలించడానికి పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి శంకరావు వెంకటరమణ పాల్గొన్నారు.

## రోడ్డు నాణ్యత పరిశీలన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో చేసిన సిమెంట్ రోడ్డు, కాలువల నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరులు, ఆర్‌అండ్‌బీ ఈఈ రామచంద్ర ఆదివారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించినదీ లేనిదీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారి వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ సుశీల తదితరులు ఉన్నారు.

## పర్యావరణ హితం

రాజాం: పర్యావరణ హితం పట్టణంలోని జీఎంఆర్ ఐటీ సమీపంలోని రాజాం మార్టు యజమాని కడగల నాగరాజు ఆదివారం పలువురికి ఉచితంగా గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి అంతా ముందుకు రావాలని కోరారు.జీఎంఆర్‌ఐటీ ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.ఎస్.వి.ప్రసాద్, రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె. నాయుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, పీడీ అరుణ్‌కుమార్, కిరణ్ కుమార్, డోల వాసుదేవరావు, పాలవలస రాజగోపాలరావు, రెడ్డి శ్రీనివాసరావు, రఘునాథ్, ఎం.సురేష్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను మోసగించడం మంచి పద్ధతి కాదు

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు

రామభద్రపురం: బదిలీల విషయంలో ఉపాధ్యాయుల(ఎస్జీటీలు)ను ప్రభుత్వం మోసగించడం మంచి పద్ధతి కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించడం మోసం చేయడమేనని అన్నారు. ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించడానికి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి అని ప్రశ్నించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సంఘ నాయకులతో నిర్వహించిన చర్చల్లో స్పష్టమైన హామీలిచ్చి, ఇప్పుడు మాట తప్పడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.వెబ్ ఆప్షన్‌పై టీచర్లలో నమ్మకం పోయిందని,ఇచ్చిన మాట ప్రకారమే ఎస్జీటీల బదిలీలను మాన్యువల్ విధానంలో నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఉపాధ్యాయులపై మోసపూరిత చర్యలను ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలోనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు,సభ్యులు ప్రవీణ్‌కుమార్,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


పాలక రంజిత్‌కుమార్

పార్వతీపురం: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో వరుసగా మూడుసార్లు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లాకు రెగ్యులర్ డీఈఓను నియమించకపోవడం శోచనీయమన్నారు. గిరిజన ప్రాంతమైన పార్వతీపురం ఐటీడీఏకు రెగ్యులర్ డిప్యూటీ డైరెక్టర్‌ను నియమించకుండా తాత్సారం చేసి గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. అలాగే ఐటీడీఏలో సెక్షన్ సూపరింటెండెంట్ కూడా ఖాళీగా ఉందన్నారు. గిరిజన విద్యాసంస్థల్లో ప్రతి ఏడాది పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నప్పటికీ మృతికి గల కారణాలపై విచారణ సైతం సక్రమంగా చేపట్టకుండా గిరిజన విద్యాలయాల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడమే కాకుండా ఐదు నెలల బకాయిలు నేటికి చెల్లించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన ఎఫ్ ఆర్ఎస్ ప్రక్రియ కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని, చాలీచాలని సిబ్బందితో ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసేందుకు గంటల తరబడి కాలం పడుతోందని, దీనివల్ల తరగతులకు వెళ్లేందుకు ఆలస్యం అవడమే కాకుండా భోజనాలకు విద్యార్థులు వెళ్లేందుకు కూడా ఆలస్యం అవుతోందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు రాష్ట విద్యాశాఖ మంత్రి లోకేష్ వస్తున్న సందర్భంగా విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారన్నారు.

## నిర్లక్ష్యపు నీడలో హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లు


మధ్యలో ఆగిపోయిన పెదపదంలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ పనులు

సాలూరు రూరల్: గత ప్రభుత్వం హయాంలో మండలంలోని ప్రతి పంచాయతీకి హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు మంజూరు చేయడంతో పాటు భవన నిర్మాణ పనులు ప్రారంభించి పలు పంచాయతీల్లో పూర్తి చేయగా మరికొన్ని గ్రామాల్లో వివిధ దశల్లో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ భవన నిర్మాణ పనులపై దృష్టి సారించడం లేదు. కొత్తవలస పంచాయతీలో గత ప్రభుత్వం నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయి ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. అలాగే కూర్మరాజుపేట, పెదపదం పంచాయతీల్లో ప్రస్తుత గిరిజన శాఖ మంత్రి శంకుస్థాపన చేసిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పనులు ప్రారంభించారు. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యంతో కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయడం లేదు. అభివృద్ధి కోసం అప్పులు చేస్తున్నామని కూటమి ప్రభుత్వ ఒక వైపు చెబుతుంటే మరో వైపు తలపెట్టిన చిన్నచిన్న పనులకు కూడా బిల్లులు చెల్లించలేక పనులు నిలిచిపోతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఎండీయూ వాహనాలను పునరుద్ధరించాలి


నిరసన తెలియ జేస్తున్న మహిళలు

సీతానగరం: ప్రభుత్వం రద్దు చేసిన ఎండీయూ రేషన్ పంపిణీ వాహనాలను పునరుద్ధరించాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి పంచాయతీ గ్రామాల్లో ఆదివారం వాహనాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించడానికి ఏర్పాటు చేసిన ఎండీఎం వాహన విధానంలో రేషన్ వినియోగదారులకు సరుకులు సకాలంలో సరుకులు పంపిణీ చేయడంతో పాటు కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందన్నారు. అంతటి సేవలందించే వాహనాలను రద్దు చేయడం దురుద్దేశపూర్వకమేనన్నారు. రద్దు చేసిన వాహనాలను పునరుద్ధరించి ఇంటింటికీ సరుకులు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జి.వెంకటరమణ పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతుల పాట్లు


నాటిన విత్తనాలకు నీరు పెడుతున్న మొక్కజొన్న రైతు

సాలూరు రూరల్: మండలంలోని మొక్కజొన్న రైతులు ముందుగా విత్తనాలు వేసి అవస్థలు పడుతున్నారు. ముందస్తు వర్షాలతో సంతోషం వ్యక్తం చేసిన రైతులు కొంతమంది తొందరపడి మొక్కజొన్న విత్తనాలు, పత్తి విత్తనాలు విత్తి ప్రస్తుతం కాస్తున్న తీవ్రమైన ఎండలతో ఉడిచిన విత్తనాలు నాటుతాయోలేవోనని ఆందోళన చెందుతున్నారు. బోరుబావి అవకాశమున్న రైతులు నీళ్లు పెట్టుకుంటున్నారు. కూర్మరాజుపేట గ్రామంలో పలువురు రైతులు ముందస్తుగానే మొక్కజొన్నలు ఉడిచారు. వారం రోజులుగా వర్షం పడకపోవడంతో బోరుబావి అవకాశం లేని రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. మరో నాలుగురోజులు ఇలాగే ఎండలు కాస్తే ముందుగా ఉడిచిన మొక్కజొన్నలు మరి నాటే పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు రైతులకు పంటలు వేసే సమయంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

## రేషన్ వాహనాలు పునరుద్ధరించాలి



ఎండీయూ వాహనాలు పునరుద్ధరించాలని నిరసన తెలియజేస్తున్న ప్రజలు

పాచిపెంట: రేషన్ వాహనాలు పునరుద్ధరించి ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పద్మాపురం గ్రామంలో ఆదివారం స్థానిక ప్రజలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ వాహనాలు రద్దు చేయడం వల్ల గిరిజన ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రేషన్ తీసుకోవడానికి సుమారు నాలుగైదు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, ప్రభుత్వం ఆనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని రేషన్ వాహనాలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు శెట్టి త్రినాథరావు, కంట నారాయణ పాల్గొన్నారు.